సాక్షి అనకాపల్లి

సోమవారం । 6 । మే । 2024



రెండో రోజూ చందనం అరగదీత

సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత రెండోరోజు ఆదివారం కొనసాగింది. 8లో



ఆకట్టుకున్న ఉదయ భానుడు

సాక్షి,పాడేరు: లగిశపల్లి రోడ్డులో తెలికపాటి మంచు తెరలను చీల్చుకుంటూ ఉదయ భానుడు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాడు.

గరిష్ఠం/కనిష్ఠం
37.3/29.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని. 30–40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచవచ్చని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

● ఆపత్కాలంలో ఆపన్నహస్తం

కన్నీటి సుడులు.. కరిగె మారాజు





విశాఖ సిటీ : చంద్రబాబుకు అరచేతిలో వైకుంఠం చూపించడంలో 40 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఏ సంఘటనైనా, ప్రమాదన్నైనా తన రాజకీయ లబ్ధికి వినియోగించుకుంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాద బాధితులకు సత్వర సాయం అందించాలని పరితపించారు. టీడీపీ హయాంలో సంభవించిన విపత్కర పరిస్థితుల్లో హడావుడి, ప్రచార ఆర్భాటాలకే పరిమితమైతే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలపై దృష్టి సారించింది. అప్పట్లో నష్టపరిహారం కోసం బాధితులు ఏళ్ల తరబడి వేచి చూడాల్సి రాగా.. ఈ ప్రభుత్వం ప్రమాదం జరిగిన గంటల్లోనే బాధితుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం జమచేసింది. ఒకవైపు సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రమాద సమయాల్లో గత, ప్రస్తుత ప్రభుత్వాలు స్పందించి సహాయం అందించిన తీరుపై ఓటర్ల మధ్య ఆసక్తికర చర్చ జరుగుతోంది. ముఖ్యంగా అప్పట్లో హుద్‌హుద్ తుపాను సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు గాలికి కొట్టుకుపోయాయి. ఈ ఐదేళ్లలో ఎల్‌జీ పాలిమర్స్, హార్బర్ ఘటనల్లోను, అలాగే వరదలతో పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా అల్లూరి జిల్లాలో నాలుగు మండలాలు నీట మునిగిన సమయంలో ప్రభుత్వం కేవలం 72 గంటల్లోనే బాధితులకు నష్ట పరిహారం అందించిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

గంటల్లోనే పరిహారం

2020, మే 7వ తేదీన జరిగిన ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాదంలో 12 మంది మృత్యువాతపడ్డారు. అనేక మంది అనారోగ్యం బారిన పడ్డారు. దీంతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆ పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాలను తరలించింది. వారందరికీ వారం రోజుల పాటు ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించింది. అలాగే మృతుల కుటుంబాలకు రూ.కోటి, ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి రూ.10 లక్షలు, ఆ ప్రాంతంలో ఉన్న ఒక్కరికీ రూ.10 వేలు చొప్పున నష్టపరిహారం కేవలం మూడు నుంచి వారం రోజుల్లోనే అందించింది. అంత భారీ స్థాయిలో పరిహారం సీఎం జగన్ ప్రకటించడంతో ప్రతిపక్షాల సైతం నోరెళ్లబెట్టాయి.

- ఎల్‌జీ పాలిమర్స్, హార్బర్ ప్రమాద సమయాల్లో అండగా ప్రభుత్వం
- యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు.. 48 గంటల్లోనే బాధితులకు పరిహారం
- మనసున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌కు జన నీరాజనాలు
- టీడీపీ హయాంలో సహాయం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- హుద్‌హుద్ బాధితులకు పరిహారం అందించని చంద్రబాబు

రాజకీయ లబ్ధికే చంద్రబాబు ఆరాటం

టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి ప్రమాదాన్ని చంద్రబాబు తమ రాజకీయ లబ్ధి కోసమే ఉపయోగించుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి తిష్టవేయడం.. మూడు, నాలుగు రోజులు దగ్గరుండి పనిచేస్తున్నట్లు హడావుడి, ప్రచార ఆర్భాటలు చేయడం.. అనుకూల మీడియాలో బాకాలు ఊదించుకోవడం.. బాధితులకు నష్టపరిహారం అందించేస్తామని చెప్పి వెళ్లిపోవడం.. ఇదీ ప్రతి ప్రమాద సమయంలోను జరిగిన తంతు. కానీ నెలలు, ఏళ్లు గడిచినా ఆ పరిహారం బాధితులకు అందించిన దాఖలాలు లేవు. అందుకు విశాఖలో హుద్‌హుద్ తుపాను ఘటనే నిదర్శనం. 2014, అక్టోబర్ 12వ తేదీన విశాఖను హుద్‌హుద్ తుపాను అతలాకుతలం చేసింది. రూ.వందల కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. చంద్రబాబు విశాఖకు వచ్చి వారం రోజుల పాటు కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాలతో కాలయాపన చేశారు. రోజంతా సమీక్షలు చేయడంతో సహాయక చర్యలు ఆలస్యమయ్యాయి. అలాగే దేశ, విదేశాల నుంచే కాకుండా కార్పొరేట్, ప్రైవేటు దాతల నుంచి రూ.వందల కోట్ల విరాళాలు వచ్చాయి. వాటితో మత్స్యకారుల కోసం ప్రత్యేక కాలనీలు నిర్మిస్తానని, నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం అందిస్తానని చెప్పి వెళ్లిపోయారు. కేవలం రెండు చోట్ల గ్రూప్ హౌసింగ్ నిర్మాణాలు చేసి చేతులు దులిపేసుకున్నారు. తరువాత వారికి ఎటువంటి పరిహారం అందించలేదు. అనేక మంది పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగినా పైసా కూడా విదిల్చలేదు.



హార్బర్ ప్రమాదంలో మూడో రోజే పరిహారం

2023, నవంబర్ 19న ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 49 బోట్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదాన్ని కూడా చంద్రబాబు రాజకీయ లబ్ధికి వినియోగించుకోవాలని ప్రయత్నించింది. మత్స్యకారులను ప్రభుత్వంపై రెచ్చగొట్టేందుకు విశ్వప్రయత్నాలు చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం చంద్రబాబు, ఇతర పార్టీలకు ఆ అవకాశం ఇవ్వలేదు. ఎప్పటిలాగే ప్రమాదం జరిగిన మూడో రోజే నష్టపోయిన బోటు యజమానులకు రూ.7.11 కోట్లు అందజేసింది. అలాగే బోట్లపై ఆధారపడి జీవనోపాధి కోల్పోయిన 400 మంది కలాసీలకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించింది.

మనసున్న ముఖ్యమంత్రి జగన్

ప్రమాద, విపత్కర పరిస్థితుల్లోను చేతికి ఎముక లేదు అన్న చందంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు సహాయం అందిస్తూ వస్తున్నారు. చంద్రబాబులా ప్రమాదాలలో రాజకీయ లబ్ధి కోసం పాకులాడకుండా.. బాధితులను ఆదుకోవడమే ప్రథమ కర్తవ్యంగా భావించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆయా ప్రాంతానికి వెళ్లి హడావుడి, ప్రచార ఆర్భాటాలు చేయకుండా యుద్ధ ప్రతిపాదికన సహాయక చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేస్తూ.. బాధితులకు పరిహారం కూడా రెండు, మూడు రోజుల్లోనే అందించారు. ఆ తరువాతే సీఎం జగన్ బాధితులను పరామర్శిస్తూ వారికి పరిహారం అందిందా? లేదా? అని మరోసారి వాకబు చేస్తూ మనసున్న ముఖ్యమంత్రిగా నిరూపించుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అప్పటి టీడీపీకి.. ఇప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన మేలుపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

కార్మికులకు తక్షణ పరిహారం

పరవాడ ఫార్మాసిటీలో 2022 డిసెంబర్‌లో లారస్ ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు చనిపోవడంతో ప్రభుత్వం తక్షణమే స్పందించి, యాజమాన్యంతో మాట్లాడింది. ఇద్దరు రెగ్యులర్ కార్మికులకు రూ.75 లక్షల వంతున, ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులకు రూ.42 లక్షల వంతున (ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియాతో కలిపి) సాయం అందించారు. ఫార్మా కంపెనీలో కార్మికులకు భద్రత కల్పించడం, కార్మికులకు భరోసా ఇవ్వడం ఈ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని కార్మిక కుటుంబాలు కృతజ్ఞత తెలిపాయి. బ్రాండిక్స్ కంపెనీలకు విషవాయువులు వ్యాప్తి చెందిన ప్రమాద సమయంలో కూడా ప్రభుత్వం వెంటనే స్పందించింది.

గోదావరి వరదల సమయంలోనూ..

భారీ వర్షాలు కారణంగా గోదావరి పోటెత్తింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలు నీట మునిగాయి. కొన్ని ఇళ్లు పూర్తిగాను, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. తాను పర్యటనకు వచ్చేలోగా సహాయక చర్యలతో పాటు బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని చెప్పారు. దీంతో పాక్షికంగా దెబ్బతిన్న సుమారు 20 వేల ఇళ్లకు రూ.2 వేలు చొప్పున మూడు రోజుల్లోనే పరిహారం అందించారు. నాలుగో రోజు సీఎం చింతూరులో పర్యటించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ పరిహారం అందిందని జగన్‌ను పొగడ్తలతో ముంచెత్తారు.



సీఎం జగన్ దేవుడిలా ఆదుకున్నారు

అగ్ని ప్రమాదం కారణంగా నా బోటు దగ్ధమైంది. జీవనోపాధి దూరమై కుటుంబం రోడ్డు మీద పడిపోయిందని భయపడ్డాను. కానీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేవుడిలా ఆదుకున్నారు. నష్టపోయిన బోటుకు 80 శాతం పరిహారాన్ని కేవలం మూడు రోజుల్లోనే ప్రభుత్వం అందించింది. ఇప్పుడు మళ్లీ కొత్త బోటును కొనుగోలు చేసుకున్నాను. ఇంత వేగంగా పరిహారం అందించిన ఏకైక ప్రభుత్వం ఇదే.

– యాగ శ్రీనివాసరావు, బోటు యజమాని



ఈవీఎంల కమిషనింగ్ కీలకం

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



యలమంచిలిలో పీవోలు,ఏపీవోలకు సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

యలమంచిలి రూరల్: ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడంలో ఈవీఎంల కమిషనింగ్ కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఈవీఎంల కమిషనింగ్ సెంటర్ అయిన గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అధికారులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఒక్కో ఈవీఎం కమిషనింగ్‌కు ఎంత సమయం పడుతుంది, ఎంత మంది సిబ్బందిని కేటాయించారో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల కమిషనింగ్ చాలా కీలకమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. కమిషనింగ్ చేసిన వాటిని మాక్‌పోల్ చేయాలన్నారు. సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే టెక్నికల్ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్ల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

రీపోలింగ్‌కు అవకాశం ఇవ్వద్దు

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సూచించారు. యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పీవో,ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రీపోలింగ్‌లకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సమర్థంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ హ్యాండ్ బుక్‌లెట్స్‌ను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధానాన్ని ఎలాంటి తప్పులు జరగకుండా చేపట్టాలని సూచించారు. ఎన్నికల ముందురోజు పోలింగ్ సామగ్రి పంపిణీలో లోటుపాట్లు లేకుండా సెక్టార్ అధికారుల వారీగా బాధ్యతలు కేటాయించాలని రిటర్నింగ్ అధికారికి సూచించారు. ఆయన వెంట ఏఆర్వో అప్పలరాజు, ఇతర అధికారులు ఉన్నారు.

జగనన్నను గెలిపిస్తాం..

- చంద్రబాబువి బూటకపు హామీలు
- మగ్గం లేని చేనేత కార్మికులకు కూడా పింఛన్



వైఎస్సార్సీపీకి మద్దతుగా ప్రతిజ్ఞ చేస్తున్న చేనేత సంఘం సభ్యులు

'చేనేత'ను ఆదుకున్నది జగన్ ప్రభుత్వమే


8లో

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

8లో

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

- జిల్లాలో 12 వేల మందికి అనుమతి
- 7, 8 తేదీల్లో పోలీసు, రవాణా, ఇతర అత్యవసర సేవల విభాగాల వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్
- నియోజవర్గానికో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు



సాక్షి, అనకాపల్లి: జిల్లాలో సోమవారం నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల విధుల్లో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోనున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. వీరికోసం జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో ఆరు ఫెసిలిటేషన్ సెంటర్లలో 26 ఫెసిలిటేషన్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. అలాగే ఆరు పీవీసీ సెంటర్లను కూడా ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఎన్నికల విధుల్లో భాగస్వామ్యమయ్యే అధికారులకు, సిబ్బందికి 6,7,8 తేదీల్లో మూడు రోజుల పాటు ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఉంటుంది. 7, 8 తేదీల్లో పోలీసు, రవాణా, ఇతర ఎసెన్సియల్ సర్వీసెస్ విభాగాలకు చెందిన వారు పోస్టల్ బ్యాలెట్‌లో ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి జిల్లాలో మొత్తం 12 వేల మంది ఉద్యోగులకు అనుమతి లభించింది.

పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులు వీరే..

- ఎన్నికల విధులు నిర్వర్తించే పోలింగ్ అధికారులు, పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్లు, డ్రైవర్లు
- ఓటర్ల జాబితాలో సర్వీస్ ఓటరుగా నమోదు చేసుకున్న వివిధ సైనిక దళాల సిబ్బంది
- అత్యవసర సేవలందించే వివిధ ప్రభుత్వ శాఖల (రైల్వే, ఆర్టీసీ, ఫైర్, వైద్య) సిబ్బంది

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కవర్‌ని తెరవగానే...కవర్, ఓటరు డిక్లరేషన్ ఫార్మ్ విడివిడిగా లేకపోతే ఆ పోస్టల్ బ్యాలెట్ కవర్‌ను పరిగణనలోకి తీసుకోరు.
- జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు.. ఓటు కలిగి ఉన్న నియోజకవర్గ ఆర్వో పరిధిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లి వినియోగించుకోవాలి. ఇతర జిల్లాల్లో ఓటు కలిగి ఉన్నవారు ఫాం–12ను సమర్పించి ఆర్వో వద్దకు వెళ్లి ఓటును వినియోగించుకోవాలి. సొంత జిల్లాకు వెళ్లనవసరం లేదు.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు

అసెంబ్లీ	ఫెసిలిటేషన్ / పీవీసీ సెంటర్	ఫోన్ నంబర్
అనకాపల్లి	జీవీఎంసీ గవరపాలెం బాయ్స్ హైస్కూలు	8500322722
చోడవరం	ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల	9441416480
మాడుగుల	ఆర్‌సీఎం స్కూల్	9441287917
యలమంచిలి	ప్రభుత్వ జూనియర్ కళాశాల	9492930842
పాయకరావుపేట	తహసీల్దార్ కార్యాలయం, నక్కపల్లి	9177454585
నర్సీపట్నం	అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీకళాశాల	9573165557

ధర్మాగ్రహం ముందు నిలవని దాదాగిరి

- రౌడీయిజం ఇక్కడ చెల్లదని బుద్ధి చెప్పిన మాడుగుల ప్రజలు
- ఇమేజ్ డ్యామేజ్ కాకుండా సీఎం రమేష్ యత్నాలు
- తన మీద దాడి జరగలేదని, తోపులాటలో చొక్కా చిరిగిందని వివరణ
- ముందు రోజు సానుభూతి డ్రామా రక్తి కట్టకపోవడంతో కొత్త నాటకం

సాక్షి, అనకాపల్లి: భయోత్పాతం సృష్టించాలన్న యత్నాలు విఫలమయ్యాయి. దాదాగిరీ చేయాలనుకుంటే.. దేవరాపల్లి ప్రజల ధర్మాగ్రహం ముందు నిలవలేకపోయాయి. సోషల్ మీడియా వేదికగా వాస్తవాలను వక్రీకరించాలనే వక్ర బుద్ధికీ జనం అడ్డుకట్ట వేశారు. ప్రశాంత అనకాపల్లిలో రౌడీ రాజకీయం చేస్తామంటే చెల్లదంటూ దేవరాపల్లి మండల ప్రజలు సీఎం రమేష్‌కు బుద్ధి చెప్పారు. ఎన్నికలకు ముందే తామేంటో సీఎం రమేష్‌కు రుచి చూపించారు. దాంతో ఇప్పుడు ఆయన మాట మార్చారు. పరువు పోతుందని తన వర్గీయులతో కొత్త పల్లవి అందుకున్నారు. అనకాపల్లిలో గల తన కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, టీడీపీ నేత తాతయ్యబాబు, జనసేన సీనియర్ నేత రాజులతో మీడియా సమావేశం ఏర్పాటు చేయించారు. సీఎం రమేష్‌పై వైఎస్సార్‌సీపీ నాయకులకు దాడి చేసే దమ్ములేదని, పోలీసులు జీపు ఎక్కించే సమయంలో జరిగిన తోపులాటలో రమేష్ చొక్కా చిరిగిందని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

ఓటమి భయంతోనే ..

అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో వైఎస్సార్‌సీపీ గ్రాఫ్ రోజురోజుకూ పెరుగుతోంది. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలు.. డిప్యూటీ సీఎంగా బూడి ముత్యాలనాయుడు అందించిన సేవలను గుర్తించిన ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీనే గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది జీర్ణించుకోలేని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఇక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పబ్బం గడుపుకోవాలని చూశారు. అదే దేవరాపల్లి మండలంలో శనివారం సీఎం రమేష్ సృష్టించిన ఘర్షణకు కారణం. డిప్యూటీ సీఎం స్థాయిలో ఉన్న ముత్యాలనాయుడు ఇంటిపై డ్రోన్ తో రెక్కీ నిర్వహించి హతమార్చే యత్నం.. అందుకు ఊతం ఇచ్చిన నిందితులను సీఎం రమేష్ వెనకేసుకు రావడం.. బూడి ఇంటికి తన అనుచరులతో కావాలని వెళ్లడం.. తనపై దాడి చేశారంటూ రాత్రి 10 వరకు పోలీస్ స్టేషన్ ముందు సీఎం రమేష్ హైడ్రామా నడపడం ... ఇలాంటి కుట్ర కొణాలను స్థానిక ప్రజలు తిప్పికొట్టారు. అంతే కాకుండా అక్కడ జరిగిన నిజాన్ని నిర్భయంగా సోషల్ మీడియాలో స్థానికులు పోస్టులతో దంచికొట్టారు. దీంతో తన అనుకూల పచ్చమీడియాలో మసిపూసి మారేడుకాయ చేద్దామన్న సీఎం రమేష్ ప్రయత్నానికి చెక్ పడింది. దీంతో ఈ ఘటన జరిగిన 12 గంటలలోపే ప్లేటు ఫిరాయించారు.

ప్రచార వాహనాల అడ్డగింత

- ప్రతిపక్ష నేతల కడుపు మంట



చౌడువాడలో రోడ్డుకు అడ్డంగా నిలిపిన టీడీపీ, బీజేపీ ప్రచార వాహనాలు.. మోహరించిన పోలీసులు

కె.కోటపాడు: చౌడువాడలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార వాహనాలను గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. శనివారం తారువలో జరిగిన పరిణామాలకు పర్యవసానంగా వారిలా అడ్డగించారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కడకు చేరుకున్నారు. ఇటువంటి సంస్కృతి గ్రామంలో లేదని, వాహనాలకు అడ్డుతొలగాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ఆకుల సాయి ప్రసాద్ కోరారు. ఇంతలో కె.కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్వామినాయుడు ఆధ్వర్యంలో కె.కోటపాడు, ఎ.కోడూరు ఎస్ఐలు లక్ష్మీనారాయణ, రమేష్‌లు సిబ్బందితో వచ్చి ఇరు వర్గాలకు చెందిన వారితో మాట్లాడారు. ఫలితం లేకపోవడంతో ఈ సమాచారాన్ని మాడుగుల రిటర్నింగ్ అధికారి దృష్టికి పోలీసులు తీసుకువెళ్లారు. ఆదివారం ఇరు పార్టీలు ప్రచారం చేయరాదని ఆర్వో ఆదేశించారు. ఈ వివాదంతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. కేంద్ర బలగాలను రప్పించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు

ఎవరినీ వదిలిపెట్టను

- సీఎం రమేష్ బెదిరింపు

దేవరాపల్లి: తారువలో తనపై ఎదురు తిరిగిన ఎవరినీ వదిలి పెట్టేదిలేదని.. ఖబడ్దార్ అంటూ రెచ్చకొట్టేలా బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ప్రసంగించారు. దేవరాపల్లిలో నియోజకవర్గ స్థాయి ప్రచార సభను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊరూరా తిప్పి గుడ్డలిప్పి కొడతానన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతుండగా జనం బయటకు వెళ్లి పోవడం ప్రారంభించారు. సీఎం రమేష్ ప్రసంగిస్తుండగా సభాప్రాంగణం సగానికిపైగా ఖాళీ అయిపోయింది.

క్లుప్తంగా

నూకాంబిక అమ్మవారి బాలాలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పుల గవర పాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర నాలుగో ఆదివారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి, పిల్లపాపలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూకాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులుతీరారు. పలు స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగు నీరు, అమ్మవారి ప్రసాద వితరణ చేపట్టారు.

రెండో రోజూ చందనం అరగదీత

సింహాచలం: సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత రెండోరోజు ఆదివారం కొనసాగింది. ఈనెల 10న చందనోత్సవం పురస్కరించుకుని ఆరోజు స్వామికి సమర్పించేందుకు కావాల్సిన మూడు మణుగుల పచ్చి చందనం(120కిలోలు)ని సమకూర్చేందుకు శనివారం అరగదీతను ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా తొలిరోజు 36 కిలోల చందనం అరగదీయగా రెండో రోజు ఆదివారం 45 కిలోల చందనం అరగదీశారు. ఆలయ వైదికులు చందనాన్ని తూకం వేసి బాండాగారంలో భద్రపరిచారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'చేనేత'ను ఆదుకున్నది జగన్ ప్రభుత్వమే



సమావేశానికి హాజరైన చేనేత కార్మికులు



ఎమ్మెల్యే కన్నబాబుకు చరఖా బహూకరిస్తున్న చేనేత సంఘం సభ్యులు

- చంద్రబాబువి బూటకపు హామీలు
- మగ్గం లేని చేనేత కార్మికులకు కూడా పింఛన్
- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు

యలమంచిలి : రాష్ట్రంలో చేనేత రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని యలమంచిలి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల చేనేత సంఘాల సభ్యుల ఆత్మీయ సమావేశం ఆదివారం యలమంచిలిలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి యూవీ రమణమూర్తిరాజు చేనేత కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో చేనేత రంగానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటునందించారన్నారు. యలమంచిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న చేనేత కార్మికులకు ఒక సామాజిక భవనం నిర్మిస్తానని తెలిపారు. మగ్గం లేని పేద, వృద్ధ చేనేత కార్మికులకు వృద్ధాప్య పింఛన్ అందజేసేందుకు కృషి చేస్తానన్నారు. బీసీలను రాజ్యసభకు పంపిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత సంఘం సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమను ఎలా ఆదుకున్నారో తెలిపారు. ఆయనకు బాసటగా నిలుస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చేనేత సంఘం సభ్యులు ఎమ్మెల్యే అభ్యర్థి రమణమూర్తిరాజుకు చరఖా బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్లు అత్రెపు గుప్త, బెజవాడ నాగేశ్వరరావు, యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ, పార్టీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కో ఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి, జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు, సింహాచలం దేవస్థానం బోర్డు మెంబర్ సూరిశెట్టి సూరిబాబు, తేలు ఈశ్వరరావు, వానపల్లి జగన్నాథరావు అరుణలత, మాడెం అప్పలరాజు, శెట్టి శ్రీను, మాడెం రమణ, తెడ్లపు సతీష్, శ్రీ భద్రావతి చేనేత సంఘం ప్రెసిడెంట్ దుప్పితూరు, మాడెం నూకరత్నం, మాడెం అప్పారావు, పోతిరెడ్డిపాలెం చేనేత సంఘం సభ్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.గజపతినగరంలో టీడీపీకి గట్టి షాక్



ఎస్.గజపతినగరం నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- 20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసల పరంపర కొనసాగుతుంది. కేంద్రం సహా రాష్ట్రంలో పలు సంస్థలు నిర్వహించిన అన్ని సర్వేల్లో వైఎస్సార్‌సీపీ మరలా విజయదుందుభి మోగిస్తుందని స్పష్టం చేయడంతో మాడుగుల నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీలోకి వలసలు మరింత జోరందుకున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా దేవరాపల్లి మండలం ఎస్.గజపతినగరంలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. టీడీపీకి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు తారువలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వారందరికీ పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తూ, తమ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన బూడి ముత్యాలనాయుడు నాయకత్వంపై ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామని వారంతా స్పష్టం చేశారు. పార్టీలో చేరిన వారిలో కొర్లి త్రినాథ్, మంకు రవి, జి. గోవింద, జి.రమణ, పైడితల్లి, కొటాన రాజు, కొటాన కరణం, దువ్వాగ గంగబాబు, ఆర్. రాజేష్ తదితరులు ఉన్నారు. అర్హులందరికీ రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ఎంపీగా ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేగా ఈర్లె అనురాధను గెలిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి పార్టీ కండువా వేసిన మలసాల భరత్‌కుమార్



ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు

అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోకు చక్కని స్పందన లభిస్తోందని, టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి 100 మంది వైఎస్సార్‌సీపీలోకి చేరారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో పట్టణంలో మిరియాల కాలనీ, భీమునిగుమ్మం ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు సమ్మంగి కనకారావు, బెల్లాన అనురాధ, బుద్ద కృష్ణ ఆధ్వర్యంలో 50 మంది, మిరియాల కాలనీ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు, తంగెళ్ల రామకృష్ణ(రెడ్డి జగదీష్ యూత్) ఆధ్వర్యంలో 50 మంది టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ వైఎస్సార్‌సీపీ కండువాను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అంతా అబద్దపు హామీలే అని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌ఛార్జి కోరుకొండ రాఘవ పాల్గొన్నారు.



భీమునిగుమ్మం వద్ద టీడీపీ నాయకులకు వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : స్థానిక 83వ వార్డు భీమునిగుమ్మం గడప గడపకు సార్వత్రిక ఎన్నికల ప్రచారం అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో 40 మంది టీడీపీ, జనసేన నాయకులు సంఘం ప్రతినిధులు చంటి, పెంటారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పార్టీ కండువావేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే మన రాష్ట్రం మరో శ్రీలంక అయిపోతుందని చెప్పిన చంద్రబాబు, టీడీపీ మ్యానిఫెస్టో వల్ల ఇప్పుడు మన రాష్ట్రం ఏమౌవుతుందో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులే చెప్పాలని అన్నారు.

ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో...

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ బీసీ కాలనీకి చెందిన టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరంతా వార్డు నాయకులు మాకిరెడ్డి అప్పారావు, దుర్గ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మీరంతా పార్టీలో చేరడం శుభ సూచికమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏ నమ్మకంతో అయితే పార్టీలో చేరారో ఆ నమ్మకాన్ని నిలబెడతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కష్టపడి పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం పాల్గొన్నారు.

రమేష్ రౌడీయిజంతో జల్లా ప్రజల్లో భయభ్రాంతులు

- బీజేపీ ఎంపీ అభ్యర్థిపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: చెరకు పంటకు నిలయమైన ఈ ప్రాంతంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రశాంత వాతావరణంలో స్వీట్‌గా జరిగేవని, నేడు కడప నుంచి దిగుమతి అయిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ పచ్చని పల్లెల్లో కడప ఫ్యాక్షనిజాన్ని పరిచయం చేస్తూ అల్లర్లు, గలాటాలకు కారణమవుతున్నారని సీపీఐ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో తన ప్రత్యర్థి ఇంటిపై 200 మందికి పైగా ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని తీసుకొని వెళ్లి దౌర్జన్యం చేశారని, మొండిగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ దేవరాపల్లి తారువలో స్థానిక ప్రజలపై దాడి చేస్తూ అక్రమంగా బైఠాయించారని అన్నారు. అక్కడ ప్రజలను రెచ్చగొట్టి దౌర్జన్యం చేయడమే కాకుండా సీఎం రమేష్ తనపైనే దాడి జరిగిందని మొసలి కన్నీరు కార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇళ్లపై డ్రోన్లు ఎగరేస్తూ ఇంట్లో ఉండే మహిళలు, చిన్నపిల్లల రక్షణకు ప్రమాదంగా మారిన ఈ సంస్కృతిని నివారించాలని ఆయన కోరారు. అధికార యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రధాని మోదీ ఉత్తరాంధ్ర సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలోని కశింకోటలో సోమవారం సాయంత్రం పర్యటిస్తున్న మోదీ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల, రైల్వే జోను, మెట్రో రైలు ప్రాజెక్ట్, సుజల స్రవంతి, షుగర్ ఫ్యాక్టరీల ఆధునికీకరణ, ఆంధ్రకు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప స్టీల్‌ప్లాంట్, ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లా ప్రత్యేక ప్యాకేజీ వంటి అంశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని గంటా శ్రీరామ్ అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అల్లు రాజు, దాకారపు శ్రీనివాసరావు, నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రచార పర్వం



అనకాపల్లి గాంధీబొమ్మ సెంటర్‌లో ఇస్త్రీచేస్తూ ఓట్లు అడుగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



ఎస్.రాయవరం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తే పింఛను ఇంటికి వస్తుందని చెబుతున్న పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు



అనకాపల్లి పెరుగుబజార్ జంక్షన్ వద్ద ప్రచారం చేస్తున్న జై భారత్ నేషనల్ పార్టీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కనిశెట్టి సురేష్‌బాబు



రావికమతంలో ఓ టిఫిన్ సెంటర్‌లో పాత్రలో ఇడ్లీ పెడుతూ ఓటు అభ్యర్థిస్తున్న చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

తుమ్మపాల : ప్రధానిని నరేంద్ర మోదీ కశింకోట మండలం రాజుపాలెం గ్రామంలో ఈ నెల 6న బహిరంగ సభకు విచ్చేయు సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. భారీ వాహనాలు, కంటైనర్లు, టిప్పర్లు లారీలు, ఇతర వాహనాలను ట్రాఫిక్ దృష్ట్యా మళ్లించడం జరుగుతుందన్నారు. సోమవారం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భారీ వాహనాలకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. వివరాలిలా...

- విశాఖపట్నం నుంచి తుని వైపు జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనాలు విశాఖపట్నం నుంచి బయలుదేరి లంకెలపాలెం జంక్షన్ - పరవాడ - అచ్యుతాపురం - ఎలమంచిలి - రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని చేరుకోవాలి.
- తుని నుండి విజయనగరం, విశాఖపట్నం వైపు వాహనాలు వెళ్లేందుకు తుని - రేగుపాలెం జంక్షన్ - యలమంచిలి బైపాస్ - అచ్యుతాపురం - పరవాడ - లంకెలపాలెం జంక్షన్- అనకపల్లి జంక్షన్ మీదుగా విజయనగరం, శ్రీకాకుళం లేదా దేశపాత్రునిపాలెం నుంచి జాతీయ రహదారి మీదుగా విశాఖపట్నం చేరుకోవచ్చు.
- సబ్బవరం జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు అనకపల్లి - లంకెలపాలెం జంక్షన్ - పరవాడ - అచ్యుతాపురం - యలమంచిలి బైపాస్ - రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని వైపు వెళ్లవచ్చు.
- చోడవరం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు అనకాపల్లి బ్రిడ్జి - మునగపాక - పూడిమడక రోడ్డు - అచ్యుతాపురం జంక్షన్ - యలమంచిలి బైపాస్- రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని వైపు వెళ్లవచ్చు.

ప్రధాని సభకు భారీ భద్రత



భద్రత ఏర్పాట్లలో పోలీసులు

కశింకోట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభకు పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. మండలంలోని ఉగ్గినపాలెం వద్ద అమలోద్భవి హోటల్ పక్కన ఉన్న న్యూ వెంచర్‌లో సోమవారం సాయంత్రం 4 గంటలకు సభ జరగనుంది. విశాఖ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో సభ వేదిక వద్దకు ప్రధానమంత్రి చేరుకుంటారు. సుమారు 2500 మంది కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులను భద్రత కోసం వినియోగిస్తున్నారు. డీఐజీ విశాల గున్ని, విశాఖ సిటీ పోలీసు కమిషనర్ రవికుమార్ అయ్యనార్, ఎస్పీ మురళీకృష్ణ, తదితరులు భద్రతా ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలిచ్చారు. సభా ప్రాంగణం సమీపంలో మూడు హెలిపాడ్‌లను ఏర్పాటు చేశారు.

జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యం

- పింఛనర్ల కష్టాలకు చంద్రబాబే మూలం
- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



బత్తివానిపాలెంలో ఎన్నికల ప్రచారంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

కె.కోటపాడు : సీఎం జగన్ సువర్ణ పాలనలో ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛనుదారుల ఇంటికే వలంటీర్లు వెళ్లి తలుపుతట్టి పింఛన్లు కష్టం లేకుండా అందించేవారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థిని ఈర్లె అనురాధలకు మద్దతుగా ఆదివారం బత్తివానిపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో వరుదు కల్యాణి మాట్లాడుతూ సీఎం జగన్ నవరత్నాల పథకాల్లో మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ లబ్ధిదారులుగా గుర్తింపు ఇచ్చారన్నారు. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలను అమలు చేయనున్నట్లు మేనిఫెస్టోలో ప్రకటించారని, అన్నట్లుగానే నాలుగు విడతల్లో మహిళలకు ఈ పథకాలను అమలు చేసి మాటను నిలుపుకొన్నారని అన్నారు. వచ్చే ప్రభుత్వంలో వైఎస్సార్ చేయూత పథకాన్ని నాలుగు విడతల్లో రూ.లక్షా 50 వేలను అక్కాచెల్లెమ్మల బ్యాంక్ ఖాతాల్లో వేయనున్నట్లు ఆమె తెలిపారు. 2014లో చంద్రబాబు చేతిలో డ్వాక్రా మహిళలు డ్వాక్రా మాఫీ అమలు చేయక మోసపోయారు అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పింఛన్లను వలంటీర్లు ద్వారా ఇవ్వకుండా ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేయడం వల్ల పింఛను లబ్ధిదారులు పంచాయతీ కార్యాలయాలకు, బ్యాంక్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యం అని, కొత్త ప్రభుత్వంలో మళ్లీ వలంటీర్ల ద్వారా జగనన్న ఇంటికే పింఛను నగదును పంపించడం ఖాయమని ఆమె తెలిపారు. చంద్రబాబు మోసపూరిత హామీలకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని కోరారు.

అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడును, మాడుగుల ఎమ్మెల్యేగా ఈర్లె అనురాధలను మంచి మెజార్టీతో ఫ్యాన్ గుర్తుకు ఓటును వేసి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, బండారు ముత్యాలనాయుడు, దోకల అప్పలనాయుడు, బండారు అక్కన్నపాత్రుడు, పల్లా కన్నమ్మ పాల్గొన్నారు.

పేదింట విషాదం

- లగేజి ఆటో నుంచి జారిపడి విద్యార్థి దుర్మరణం



మృతి చెందిన విద్యార్థి గూడుపు సతీష్(17)

యలమంచిలి రూరల్ : వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకుండా కాలేజీ చదువుల కోసం కూలి పనికి వెళ్లిన ఓ పదో తరగతి ఉత్తీర్ణుడైన విద్యార్థి ఊహించని రీతిలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇటీవల 10వ తరగతి ఉత్తీర్ణుడైన తమ కుమారుడు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకుంటాడనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు ఆవిరయ్యాయి. విగతజీవిగా మారిన కొడుకుని చూసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించడం చూపరులను సైతం కంటతడి పెట్టించింది. వివరాలివి. కశింకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన గూడుపు అర్జున్ చిన్న కుమారుడు సతీష్ (17) వేసవి సెలవులను ఆటపాటలతో వృధా చేయకుండా ఏదో పనిచేసి కొంత మొత్తాన్ని సంపాదిస్తుంటాడు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లిలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. షేక్‌శిల్లపాలెం వద్ద రాము అనే టెంట్ హౌస్ యజమాని వద్ద రోజువారీ కూలి పనిలో చేరాడు. శనివారం ఓ లగేజీ ఆటోలో టెంట్‌హౌస్ సామగ్రిని తీసుకెళ్తుండగా సామగ్రికి కట్టిన తాడు ఊడిపోవడంతో తొట్టిలో ప్రయాణిస్తున్న సతీష్ రోడ్డుపై పడిపోయాడు. అతడిపై టెంట్‌హౌస్ సామగ్రి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో చికిత్స కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి షేక్‌శిల్లపాలెం కూడలికి సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘటనపై మృతుని సోదరుడు మోహన్‌సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పైల సింహాచలం ఆదివారం రాత్రి మీడియాకు తెలిపారు. మృతదేహానికి యలమంచిలి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు అప్పగించామని ఎస్ఐ చెప్పారు.

8 నుంచి 13 వరకు అప్పన్న ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు భగవత్ రామానుజాచార్యుల తిరునక్షత్రం పూజలను విశేషంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ తేదీల్లో అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ఈ నెల 8, 11, 12 తేదీల్లో రాత్రి 7గంటల వరకే స్వామివారి దర్శనాలు లభిస్తాయన్నారు. అలాగే, శ్రీవైష్ణవ శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈ నెల 13న సాయంత్రం 5గంటలకు హనుమత్ వాహనంపై స్వామికి తిరువీధి జరుగుతుందని తెలియజేశారు.

క్లుప్తంగా

నేడు నాలుగు గ్రామాల్లో ఎమ్మెల్యే కన్నబాబు ప్రచారం

మునగపాక: మండలంలోని నాలుగు గ్రామాల్లో సోమవారం ఉదయం ఎమ్మెల్యే కన్నబాబు ప్రచారం చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి కాకరాపల్లి, రాజుపేట, పురుషోత్తపురం, పల్లపు ఆనందపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

భగవద్గీతపై శిక్షణ తరగతులు ప్రారంభం


భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న సుసుమ్న కుమార్

మునగపాక: ప్రతి ఒక్కరూ భగవద్గీత పట్ల అవగాహన పెంచుకోవాలని ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం మేనేజింగ్ ట్రస్టీ సుసుమ్న కుమార్ కోరారు. మండలంలోని తోటాడలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీతపై శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. శిక్షణకు వచ్చిన వారిని మూడు బృందాలుగా విభజించారు. వారికి ఉచితంగా పుస్తకాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం 10 గంటలకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇటువంటి శిక్షణను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. తోటాడ,సిరసపల్లి, నారాయుడుపాలెం,గవర్ల అనకాపల్లికి చెందిన పలువురు శిక్షణకు హాజరయ్యారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి


సమావేశమైన సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

రాంబిల్లి: ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, తద్వారా పలు ప్రయోజనాలు పొందవచ్చని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి అప్పారావు అన్నారు. కొత్తపేటలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఆలయాల్లో సామూహిక హారతి, భజనలు తదితర కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో సమరసత సేవ ప్రతినిధులు నూకరాజు, గగన్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ప్రసన్న వదనం	: రాజా
శబరి	: సత్యనారాయణస్క్రీన్-1
టెనెంట్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటి అడక్కు	: పర్తిసాయి
రత్నం	: వెంకటేశ్వర
పారిజాత పర్వం	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 1,699 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,120	4,760
మొదటి రకం	3,720	4,800
రెండో రకం	3,600	4,250
మూడో రకం	3,210	3,570

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-2 యూనిట్లు, బి పాజిటివ్-15 యూనిట్లు, ఒ పాజిటివ్-13 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 264 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

డెవలప్‌మెంట్ వాచ్

రోడ్లకు మహర్దశ


కశింకోట - వెదురుపర్తి గ్రామాల మధ్య నిర్మించిన తారు రోడ్డు


అనకాపల్లి పట్టణంలో అభివృద్ధి చేసిన రోడ్డు


వెంకుపాలెం-కుంచంగి రోడ్డు


కేబీ రోడ్డు

తుమ్మపాల: అనకాపల్లి నియోజకవర్గంలో రోడ్లు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. గత టీడీపీ పాలనలో రహదారులు అధ్వానంగా దర్శనమిచ్చేవి. రాళ్లు తేలిన రోడ్లపై రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే వీటికి మహర్దశ పట్టింది. గత ఐదేళ్లలో ఆర్‌అండ్‌బీ రోడ్లను పూర్తి స్థాయిలోకోట్లరూపాయలతో అభివృద్ధి చేశారు. అనకాపల్లి పట్టణం, మండలం, కశింకోట మండలాల్లో రూ.10.7 కోట్లతో రోడ్లు నిర్మించారు.

● అనకాపల్లి మండలంలో వెంకుపాలెం నుంచి కుంచంగికి 8.3 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.2.35 కోట్లు ఖర్చు చేశారు.మామిడిపాలెం -కొండుపాలెం రోడ్డుకు రూ.1.20 కోట్లు, తుమ్మపాల నుంచి తగరంపూడి రోడ్డుకు రూ.కోటి, కశింకోట మండలంలో బయ్యవరం రైల్వే గేటు వద్ద రోడ్డుకు రూ.1.5 కోట్లు, కశింకోట నుంచి వెదురుపర్తి రోడ్డుకు రూ.1.70 కోట్లు, పట్టణంలో అనకాపల్లి -చోడవరం, అనకాపల్లి నుంచి పూడిమడక వరకు 5.83 కిలోమీటర్ల మేర పొడవు గల రోడ్డుకు రూ.2.90 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

వైఎస్ జగన్‌తోనే మెరుగైన పాలన


ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న యువకులు


సమావేశానికి హాజరైన ప్రజలు

● అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి

మునగపాక: జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి కోరారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే మెరుగైన పాలన అందుతుందని తెలిపారు. స్థానిక నందీశ్వర ప్రాంగణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించిన జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పక్షపాతిగా గుర్తింపు పొందారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా చేపట్టారని చెప్పారు. ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. మునగపాక గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన ప్రగతి,లబ్ధిని గుర్తుంచుకుని ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు,యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ మాట్లాడుతూ చంద్రబాబు అండ్‌కో మాయ మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు,ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,బోడకుర్తి గణేష్, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ,పార్టీ నాయకులు ఆడారి కాశీబాబు, టెక్కలి కొండలరావుతోపాటు పార్టీ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా మునగపాక తంపర మూలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు.వారికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలి


కోట్నీవీధిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బి.వి.సత్యవతి


గొలగాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: సంక్షేమ రథ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీగా సీఎంగా ఆశీర్వదించవలసిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. స్థానిక 83, 84 వార్డుల ఇన్‌చార్జ్‌లు జాజుల రమేష్, కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో భీమునిగుమ్మం, కోట్నివీధి, గొల్లవీధి, కర్ణాలవీధి, బొగ్గారపువారి వీధి, గాంధీబొమ్మ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హారతులు ఇచ్చి దీవించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటిజానకీరామరాజు, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి, పార్టీ నాయకులు అప్పికొండ రవిశంకర్, కోరుకొండ అప్పలసూరి, కోరుకొండ మునిస్వామి,గాడి మాదురినాయుడు, కేతిరెడ్డి ప్రసాద్, కొణతాల సత్తిబాబు,సేనాపతి సాయి జెట్టి వాసు, మమ్మిడి లక్ష్మీపతి,బి. ఈశ్వరరావు, కొణతాల సత్తిబాబు, కొట్ని శ్రీనివాస్,పిల్లల శివ అప్పారావు, సూరిశెట్టి వికాస్, యల్లపు గోవిందు, యండ్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం

అనకాపల్లి: మండలంలోని శంకరం, రేబాక, గోలగాం, బట్లపూడి గ్రామాల్లో శనివారం రాత్రి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ విస్తృతంగా ప్రచారం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్ని భరత్‌కుమార్‌కు హారతులు ఇచ్చి, ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసినట్టు చెప్పారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్,ఎంపీపీ గొర్లి సూరిబాబు,శంకరం సర్పంచ్ పసుపులేటి లక్ష్మీరామకృష్ణ, అసెంబ్లీ ఎన్నికల పరిశీలికులు కాశీ విశ్వనాథం, గొలగాం సర్పంచ్ నరసింహరావు, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ముగిసిన శిక్షణ


పీవో,ఏపీవోలకు శిక్షణ ఇస్తున్న రిసోర్సు పర్సన్

యలమంచిలి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ ఆదివారంతో ముగిసింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గంలో విధులు నిర్వహించనున్న 300 మందికి ఈవీఎంల పనితీరు, పోలింగ్ నిర్వహణపై రిసోర్సుపర్సన్లు రెండోరోజు శిక్షణనిచ్చారు. పీవో,ఏపీవోలతో పాటు ఓపీవోలకు కూడా శిక్షణలో పోలింగ్ విధులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోలింగ్ ముందురోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో మెటీరియల్ రిసీవింగ్, మాక్ పోలింగ్ నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలను వివరించారు.ఈవీఎంలను ఎలా వినియోగించాలి? బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్,కంట్రోల్ యూనిట్‌తో ఏ విధంగా అనుసంధనం చేయాలి అనే విషయాలపై పోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించారు.

తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కౌంటర్లు

నక్కపల్లి : పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి జరిగే ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వారి కోసం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 1414 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నారు. వీరి కోసం ఈనెల 6,7,8 తేదీల్లో ప్రత్యేంగా ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు.

స్ట్రాంగ్ రూములు పరిశీలించిన కలెక్టర్

నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదివారం పరిశీలించారు. ఈవీఎంలను ఈ స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ప్రత్యేక కౌంటర్లను కూడా కలెక్టర్ పరిశీలించారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి..


మార్టూరులో టీడీపీ నాయకులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: టీడీపీ భూటకపు ఎన్నికల మేనిఫెస్టోను చూసి విరక్తిచెంది ఆ పార్టీ నాయకులతో పాటు జనసేన నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ తెలిపారు. అనకాపల్లి మండలం మార్టూరుకు చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు గ్రామ సర్పంచ్ కరణం వెంకటశివ రెవెన్యూనాయుడు, ఎంపీటీసీ మిద్దె రాజాచంద్రరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి కశింకోట మండలం ఏఎస్‌పేటలోని తన స్వగృహంలో ఆదివారం మలసాల భరత్‌కుమార్ వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మార్టూరు సురేష్, మార్టూరు చిన్నారావు, శ్రీను, గణేష్, లోకేష్, నాగేశ్వరరావు, పొలిమేర సింహాచలంతో పాటు మరికొంతమంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో మార్టూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఒమ్మి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.


సుకుమార వర్మతో ఈశ్వరరావు

జనసేన నేత చేరిక

అచ్యుతాపురం: మండలంలోని దోసూరు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు ఈశ్వరరావు ఆదివారం వైఎస్సార్ సీపీ చేరారు. ఆయనకు డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ వైఎస్సార్ సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

భారీ ర్యాలీతో ఎమ్మెల్యే కన్నబాబు ప్రచారం


ఎస్‌ఈజెడ్ కాలనీలో ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న కన్నబాబు


భారీగా నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ

అచ్యుతాపురం: మండలంలోని ఎస్‌ఈజెడ్ కాలనీలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఆదివారం భారీ ర్యాలీతో ప్రచారం చేశారు. ఈ ప్రచారానికి అనూహ్య స్పందన లభించింది. వందలాది బైక్‌లతో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మార్టూరులో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజక వర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, అచ్యుతాపురం మండల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే అన్ని వర్గాలకు మేలు


ఒంపోలులో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ


అరబుపాలెంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మహిళలు


వాడ్రాపల్లిలో బూత్‌కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సర్పంచ్ నూకరాజు


టి.సిరసపల్లిలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి


కశింకోటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

మునగపాక: అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ తెలిపారు. ఆదివారం ఆయన ఒంపోలు, అరబుపాలెం, తిమ్మరాజుపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాల ద్వారా అన్ని కుటుంబాలకు మేలు జరిగిందన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా జరిగిన మేలును గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. అనకాపల్లి ఎంపీ, యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, పార్టీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ,బొద్దపు శ్రీరామమూర్తి, ద్వారం జానకిరామ్,తాతారావు,బొడ్డేడ బుజ్జి, తుట్టా వెంకటప్పారావు, పాలునాయుడు, ,భీమిశెట్టి ఉమాశంకర్, మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు,ఆడారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

● వాడ్రాపల్లిలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆదివారం బూత్‌స్థాయి కమిటీల సభ్యులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామజోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

● టి.సిరసపల్లిలో సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి శనివారం రాత్రి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు.

రాంబిల్లి: సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని జెడ్పీటీసీ ధూళి నాగరాజు కోరారు. కట్టుబోలులో ఆదివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి రమణమూర్తిరాజు, ఎంపీ అభ్యర్థు బూడి ముత్యాలనాయుడును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు హామీలను నమ్మవద్దన్నారు. ఎటువంటి అక్రమాలకు తావులేకుండా ఇంటి వద్దకే పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు అగ్రహారపు బాబూరావు, జనపరెడ్డి చిన్న తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండల కేంద్రం కశింకోటలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయినగర్, ఇందిరా కాలనీ, అఫీషియల్ కాలనీ, భవానీ కాలనీ, సమగ్ర బాలికల వసతి గృహం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి, రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

● శిక్షణ తరగతుల నోడల్ అధికారి నాగలక్ష్మి


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాగలక్ష్మి

మాడుగుల: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పీవో, ఏపీవోలు సిద్ధంగా ఉండాలని ఎన్నికల శిక్షణ తరగతుల జిల్లా నోడల్ అధికారి నాగలక్ష్మి తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్‌లో పీవో, ఏపీవోలకు రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ఎన్నికల నియమావళి అనుసరించి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎన్నికల డీటీ ఎం.రాజా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన రోడ్లపై విమర్శలు సిగ్గుచేటు

మాడుగుల రూరల్: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. ఆదివారం ఆయన తాటిపర్తి, పొన్నవోలు గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో గిరిజన శివారు గ్రామాలను అనుసంధానం చేస్తూ నాణ్యమైన రహదారులు నిర్మించారన్నారు. వీటి మీద ప్రయాణం చేస్తూ ప్రతిపక్షాలు విమర్శలు చేయడం శోచనీయమన్నారు. తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేశారన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈర్లె అనురాధలను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

చోడవరం నియోజకవర్గం ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచీ జరగని అభివృద్ధి ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలోనే కనిపిస్తోంది. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉండిపోయిన అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇదే ప్రాంతంలో పదేళ్ల పాటు పని చేసిన టీడీపీ ఎమ్మెల్యే గుక్కెడు తాగునీరు ఇచ్చిన పాపాన పోలేదు.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే సమగ్రాభివృద్ధి
- 60 ఏళ్లుగా కానరాని ప్రగతి ఐదేళ్లలోనే..
- దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం

సాక్షి ఫోకస్ / sakshi focus

చోడవరం... అభివృద్ధి పరం


రూ.82 కోట్లతో నిర్మించిన బంగారుమెట్ట-కశింకోట రోడ్డు

చోడవరం: నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి పనులు అనేకం చేపట్టారు. రూ.1,800 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగాయి. ఇంత భారీ మొత్తంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ కాలేదు. రూ. 850 కోట్ల అభివృద్ధి పనులు చేయగా, మరో రూ. 850 కోట్లు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేసింది. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ పథకాలు పొందడం కోసం సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలనను గ్రామస్థాయికి తెచ్చింది. నియోజకవర్గంలో 1,445 మంది వలంటీర్లను నియమించి నేరుగా ప్రభుత్వ పథకాలన్నీ ప్రజల ఇంటికే చేరుస్తోంది. రైతు భరోసా కేంద్రాలు నిర్మించి విత్తనాలు, ఎరువులు, కిమిసంహారక మందులు గ్రామాల్లోనే అందిస్తున్నారు. పంట సీజన్లలో నేరుగా రైతుల వద్దకే శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు వచ్చి వ్యవసాయ సూచనలు ఇస్తున్నారు. విద్యుత్ లైన్ వేయలేని 42 మైదాన గిరిజన గ్రామాలకు సోలార్ సిస్టమ్స్ సాయంతో మంచినీటి సౌకర్యం కల్పించిన ఏకైక ప్రభుత్వం. 20 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ప్రధాన రహదారులన్నీ కోట్లాది రూపాయలతో కొత్త రోడ్లను వేసి ప్రజల కష్టాలను తీర్చారు. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు ధీమా కలిగించడంపై సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది.


చోడవరంలో రూ.18 కోట్లతో నిర్మించిన మినీ మంచినీటి రిజర్వాయరు

పదేళ్లలో టీడీపీ ఎమ్మెల్యే చేసింది శూన్యం

పదేళ్లపాటు టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేసిన కె.ఎస్.ఎన్.ఎస్. రాజు చోడవరం నియోజకవర్గంలో ప్రధాన సమస్యల్లో ఏ ఒక్కటీ పరిష్కరించలేదు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో మంజూరైన సీసీరోడ్లు మినహా ఒక్క సమస్యను పరిష్కరించలేకపోయారు. 2009 నుంచి 2019 వరకూ ఆయన ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నారు. 2014–19 వరకూ టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. తన సొంత ప్రభుత్వ హయాంలోనూ ఒక్క లింకురోడ్డు నిర్మించలేదు. ప్రధానమైన రాజాం రోడ్డు, గవరవరం, బెన్నవోలు, తోటకూరపాలెం, ఆర్లె, బంగారుమెట్ట రోడ్డు, కుసర్లపూడి, గౌరీపట్నం, జుత్తాడ, భోగాపురం, లక్ష్మీపురం రోడ్లతోపాటు అనేక గ్రామాలను అనుసంధానం చేసే బీటీరోడ్లు పెద్ద పెద్దగోతులు ఏర్పడి ప్రమాదాలకు నిలయమై ఎంతోమంది చనిపోయారు. తాగునీటి ఎద్దడితో జనం అల్లాడుతున్నా ఒక్క గ్రామానికి పూర్తిస్థాయిలో సమస్య పరిష్కరించలేదు. భారత్‌మాల పథకంలో బీఎన్‌రోడ్డును మంజూరు చేస్తామని, అది ప్రతిపాదనలకే పరిమితం చేశారు. చోడవరం పట్టణంలో గుక్కెడు తాగునీరు ఇవ్వలేకపోయారు. టీడీపీ కార్యకర్తల ఇసుక తవ్వకాల పుణ్యమా అని కూలిపోయిన బొడ్డేరు, గవరవరం వంతెనలు పూర్తి చేయలేకపోయారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేస్తామని చెప్పి టీడీపీ పాలకవర్గం రూ. 150 కోట్లు అప్పుల ఊబిలోకి నెట్టి వారు మాత్రం కోట్లు సంపాదించుకున్నారు. ఒక్క సాగునీటి ప్రాజెక్టును అభివృద్ధి చేయలేదు. యువతకు ఉపాధి కల్పించే ఒక్క పరిశ్రమ నెలకొల్పలేకపోయారు. అసలు ఆయన ఎమ్మెల్యేగా పదేళ్లలో ఏ ఒక్కా ప్రధాన సమస్యను పరిష్కరించలేకపోయారు.



నెరవేరిన సొంతింటి కల

- **నియోజకవర్గంలో జగనన్న కాలనీలు : 96 లేఅవుట్లు**
- ఇళ్లులేని వారికి ఇచ్చిన ఇంటి పట్టాలు: 4,547
- జగనన్న కాలనీల్లో మంజూరైన ఇళ్లు: 4,720
- ఇంటి స్థలం ఉండి పక్కాగృహం మంజూరైన లబ్ధిదారులు: 4,297
- మొత్తం ఇళ్లకు ప్రభుత్వం మంజూరు చేసింది: రూ. 162 కోట్లు
- ఇప్పటి వరకూ ఇళ్లు కట్టుకున్న వారికి చెల్లించినది: రూ. 87 కోట్లు
- జగనన్న కాలనీల్లో విద్యుత్, రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించారు.


ఇంటింటికీ మంచినీటి కుళాయిలు

- మొత్తం ప్రాజెక్టు విలువ: రూ. 156 కోట్లు
- నియోజకవర్గంలో మొత్తం పంచాయతీలు: 117
- శివారు గ్రామాలతో కలిపి గ్రామాలు: 154
- కుళాయి కనెక్షన్లు ఇంచిన ఇళ్లు : 58వేల 600
- కొత్తగా నిర్మించిన మంచినీటి ట్యాంక్‌లు : 80
- మొత్తం పనులు -800 • నీటి పంపింగ్ బోర్లు -120
- పైపులైన్ విస్తీర్ణం: 500 కిలోమీటర్లు
- తాగునీరు కల్పించిన మైదాన గిరిజన పంచాయతీలు: 15
- గిరిజన తండాల్లో నీటి పంపింగ్ కోసం సోలార్ యూనిట్లు: 42
- జగనన్న కాలనీల్లో : రూ.14 కోట్లతో మంచినీటి సాకర్యం
- చోడవరం పట్టణం తాగునీటికి మినీ రిజర్వాయరు: రూ. 18.5 కోట్లు

నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ లింక్‌రోడ్ల నిర్మాణం

ప్రధానంగా గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మిగిలిపోయిన అనేక రోడ్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నిర్మించారు. వీటికోసం రూ. 250 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఇప్పటికే రూ. 82 కోట్లతో బంగారుమెట్ట– కశింకోట రోడ్డు, రూ. 48 కోట్లతో చేపట్టిన చోడవరం – సింహాద్రిపురం, చోడవరం – లక్ష్మీపురం, గోవాడ–భోగాపురం, చోడవరం–గవరవరం, బీఎన్‌రోడ్డు నుంచి వయా గౌరీపట్నం వడ్డాది కస్పా రోడ్డు, తట్టబంద – రాజాం రోడ్డు, బుచ్చెంపేట రోడ్డు, తోటకూరపాలెం – రావికమతం రోడ్డు, రావికమతం – చలిసింగ రోడ్డు, చినపాచిలి రోడ్డు, గుర్రాలపాలెం రోడ్డు మేడివాడ – కానాడ రోడ్డు, మేడివాడ – బాదంపాడు రోడ్డు, రోలుగుంట – శరభవరం, కె.నాయుడుపాలెం వయా నిండుగొండ, బుచ్చెంపేట రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కొత్తగా మరో రూ.20.5 కోట్లతో రాజుపాలెం రోడ్డు, సీతయ్యపేట వయా పంగిడి రోడ్డు, ఐతంపూడి రోడ్డు, గుడివాడ రోడ్డు, గొల్లలపాలెం రోడ్డు, గొన్నవానిపాలెం రోడ్డు, రావికమతం–మరుపాక రోడ్డు పనులు జరుగుతున్నాయి.

ఐదేళ్ల పాలనలో ఎంతో చేశాం



గత టీడీపీ హయాంలో కేంద్రం నుంచి వచ్చిన ఎన్‌ఆర్జీఈఎస్ సీసీ రోడ్లు తప్పా ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమంలో చాలా ఎక్కువగా చేశాం. నియోజకవర్గంలో అన్ని రోడ్లను కొత్తగా వేయించాం. ప్రతీ గ్రామంలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్లు కట్టించి ప్రభుత్వ సేవలందేలా చేసింది. గిరిజన తండాలకు మంచి నీరు అందించాం. ఆస్పత్రులు అభివృద్ధి చేశాం. రూ.1,800 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిన ఏకైక ప్రభుత్వం మాదే. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పనులు చేపడతాం.

– కరణం ధర్మశ్రీ,
ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, చోడవరం



నాడు - నేడు స్కూళ్లు

- అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలతో కార్పొరేటు స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారు. తరగతి గదుల్లో బెంచీలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు.
- ఎంపికైన మొత్తం స్కూళ్లు–181
- వ్యయం–రూ. 48 కోట్ల 18లక్షలు
- ఆధునికీకరణ, అదనపు తరగతి గదులు నిర్మాణానికి వినియోగం అదనపు తరగతి గదుల నిర్మాణం–148
- విద్యార్థుల సంఖ్య–22,120 మంది

అభివృద్ధి చెందిన కాలేజీలు

- జన్నవరంలో జ్యోతీబాపూలే హాస్టల్ భవన నిర్మాణానికి : రూ. 85 కోట్లు
- పాలిటెక్నికల్ కాలేజీ నిర్మాణానికి: రూ. 9.45 కోట్లు
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలకు : రూ. 5 కోట్లు
- చోడవరం గవర్నమెంటు డిగ్రీ కాలేజీ పీజీ కాలేజీగా అప్‌గ్రేడ్

	గ్రామ సచివాలయాలు	హెల్త్ సెంటర్లు (విలేజ్ క్లినిక్‌లు)	రైతు భరోసా కేంద్రాలు
మొత్తం భవనాలు	84	78	87
నిర్మాణ వ్యయం	రూ.92.10 కోట్లు	రూ.12.7 కోట్లు	రూ.18.97 కోట్లు
పూర్తి అయినవి	68	28	86
నిర్మాణంలో ఉన్నవి	21	44	1
సిబ్బంది	648	146	69
వలంటీర్లు	1,445	-	-
ఆశ కార్యకర్తలు	-	185 మంది	-


నియోజకవర్గంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు ఇలా

పథకం పేరు	మొత్తం లబ్ధిదారులు	పంపిణీ నగదు(లక్షల్లో)
రైతు భరోసా	51,724	298.74
అమ్మ ఒడి	99,068	11,552.21
వైఎస్సార్ చేయూత	20,599	10,818.00
వైఎస్సార్ ఆసరా	61,408	1,2542.98
వైఎస్సార్ పింఛన్	46,248	1,261.86 కోట్లు
కాపు నేస్తం	7,978	1196.70
వాహనమిత్ర	8,540	854.00
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	21,712	4,494.17
సున్నావడ్డీ	67,914	2,048.00
వైఎస్సార్ చేదోడు	8,294	628.00

ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి, నూతన భవనాల నిర్మాణం

- ఆధునికీకరించిన ఆస్పత్రులు -8
- తురకలపూడి పీహెచ్‌సీకి కొత్త భవనం ఆధునీకీకరణ: రూ.కోటి
- రావికమతం పీహెచ్‌సీ ఆధునికీకరణ : రూ.90 లక్షలు
- చోడవరం సీహెచ్‌సీ ఆధునికీకరణ : రూ. 1.10 కోట్లు
- ఆపరేషన్ థియేటర్, ఐక్యూబ్ సెంటర్, స్కానింగ్ మిషన్, ఇతర మౌలిక సదుపాయాలు





గోవాడ సుగర్స్ ఫ్యాక్టరీని ఆదుకున్న ప్రభుత్వం

టీడీపీ హయాంలో ఫ్యాక్టరీ అప్పులు : రూ.140 కోట్లు
వైఎస్సార్‌సీపీ వచ్చాక గ్రాంట్‌గా ఇచ్చి తీర్చిన అప్పు : రూ. 40 కోట్లు
రుణంగా ఫ్యాక్టరీకి ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ రూ. 85 కోట్లు
డిస్టిలరీ యూనిట్ ఏర్పాటుకు : రూ.100 కోట్లుతో ప్రతిపాదన
చెరకు బకాయిలు రైతులకు చెల్లింపునకు, కార్మికు జీత భత్యాల కోసం ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటు : రూ. 12.40 కోట్లు

మహిళలే మహారాణులు

- చక్కటి సేవలతో ప్రజల ఆదరణ చూరగొన్న మాడుగుల ఆఖరి మహారాణి రమాకుమారిదేవ్
- ఎమ్మెల్యేగా సేవలందించిన బొడ్డు కళావతి
- ప్రజా సేవకు సిద్ధమంటున్న స్థానిక అభ్యర్థి ఈర్లె అనూరాధ



మాడుగుల మహారాణి రమాకుమారిదేవ్ (ఫైల్)

మాడుగుల : మాడుగుల మహారాజుల పాలన కాలంలో ఈ ప్రాంతం సుభిక్షంగా తులతూగుతూ ఉండేదని, దేశ విదేశాల నుంచి వచ్చే ప్రముఖులతో నిత్యం కళకళలాడేదని చరిత్రకారులు చెబుతున్నారు. యుద్ధ వీరులను తయారు చేయడానికి ఏడు సావిడిలు, గుర్రాలకు తర్ఫీదు ఇచ్చేందుకు ప్రత్యేక శిక్షణ శాలలు ఉండేవని స్థానికంగా వయసు మళ్లిన వారు ఇప్పటికీ చెబుతుంటారు. అయితే రాజుల కాలం ముగిసిపోయిన తర్వాత ఇక్కడి కోటలో నాటి రాజ వంశస్తులు ఎవరూ నివాసం ఉండకపోవడంతో కోట శిథిలమైపోయింది. జమిందారీ వ్యవస్థ రద్దయే ముందు ఒక ఏడాది రమాకుమారి దేవ్, భర్త రామకృష్ణదేవ్ ఈ సంస్థానం చిట్టచివరి రాజవంశీకులుగా పాలన సాగించారు. రమాకుమారి దేవ్ చిట్టచివరి మహారాణిగా ఇక్కడి వారు చెబుతుంటారు. జమిందారీ వ్యవస్థ రద్దు కావడంతో రమాకుమారి దేవ్ మాడుగుల కోటలో నివాసం ఉంటూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఆమె 1967 నుండి 1972 వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాజుల కాలాన్ని గుర్తు చేస్తూ పరిపాలన సాగించి ప్రజల మన్ననలు పొందినట్లు ఇక్కడి వారు చెబుతుంటారు. అలాగే మాడుగులలో బొడ్డు కళావతి కూడా ఎమ్మెల్యేగా సేవలందించారు. ఇక ప్రస్తుత కాలానికి వస్తే వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనూరాధ బరిలో ఉన్నారు. తండ్రి బూడి సేవాగుణాన్ని పుణికిపుచ్చుకున్న అనూరాధ పేదల సేవలో అలుపూసొలుపు లేకుండా శ్రమిస్తూనే ఉన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా సాయం అర్థించిన వారిని ఆదుకుంటూ నాటి దయార్ద్ర హృదయులైన రాణులకు తానేమీ తీసిపోనని మాడుగుల ప్రజలచే మన్ననలు అందుకుంటున్నారు.

గత చరిత్రను మార్చిన నేతకే నా ఓటు



నా పేరు గోగాడ మోహన్ కుమార్. మాది రేబాక గ్రామం. నాకు మొదటి సారి ఓటు హక్కు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. మహిళాభ్యున్నతికి.. విద్యకు ప్రాధాన్యతనిచ్చే వారికే నేను ఓటు వేస్తాను. మాట ఇస్తే తప్పని నేతనే ఎన్నుకుంటాను. సమాజం అంటే అన్ని వర్గాల వారు ఉంటారు. కనుక ఏ ఒక్క వర్గానికో న్యాయం చేస్తే సరిపోదు. పిల్లలు, పెద్దవాళ్లు, వృద్ధులు.. ఇలా అందరి గురించి ఆలోచించే నేత వెన్నంటే ఉంటాను. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సింహంలా పోరాటం చేసే నాయకుడికే జైకొడతాను. మునుపటి చరిత్రను సమూలంగా మార్చి పాలన అంటే ఇది.. అభివృద్ధి అంటే ఇది అని ధైర్యంగా చెప్పగలిగే లీడర్‌ను స్వాగతిస్తాను.



చూపుడు వేలు లేకుంటే సిరాచుక్క ఎక్కడ?

మీకు తెలుసా?

సాక్షి, విశాఖపట్నం: పోలింగ్ కేంద్రాల్లో మోసాలు జరగకుండా ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఎడమచేతి చూపుడు వేలికి సిరా మరక పెడతారన్న సంగతి తెలిసిందే. అయితే ఓటు వేసే వ్యక్తికి ఎడమ చేతి చూపుడు వేలు లేకపోతే ఎలా అన్న ప్రశ్న తలెత్తవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎన్నికల సంఘం ఓ ఏర్పాటు చేసింది. ఎడమ చేతికి చూపుడు వేలు లేకపోతే మధ్య వేలుకు అదీ లేకుంటే చిటికెన వేలికి అదీ లేకుంటే బొటన వేలికి సిరా మరక పెట్టాలని నిర్దేశించింది. అసలు ఎడమ చేతికి వేళ్లు పూర్తిగా లేకుంటే కుడి చేతి చూపుడు వేలికి సిరా గుర్తు పెట్టాలని, అప్పటికీ సమస్య వస్తే వేళ్ల మధ్య, మొదళ్ల మధ్య, లేదా ఏ భాగంలోనైనా.. వేలి పైనే సిరా మరక వేయాలని సూచిస్తోంది.

మంచి సేయనోడు.. మతలబులు సేత్తన్నాడు

- బాబు దాష్టీకాలపై సామాన్య జనం మండిపాటు
- రచ్చబండ వేదికగా జగన్ పాలనను నెమరువేసుకుని మురిసిన పండుటాకులు
- బాబు రాజకీయాలతో తమ బతుకులు ఇబ్బందుల్లో పడ్డాయని ఆవేదన

రచ్చబండ


మునగపాకలో రచ్చబండ వద్ద చర్చించుకుంటున్న వృద్ధులు, స్థానికులు


అచ్యుతాపురం: ఏటో ఈ రాజకీయాలు.. సుఖానున్న పేణాన్ని కట్టాల్లోకి నెట్టేసాయి. పించినీ కోసం గొర్రెల్నాగా ఉరకాల్సి వత్తాంది.. జగన్‌బాబు మాటిత్తే తప్పడు కదా.. మన పాస్ పుస్తకాల మీద ఆయన ఫొటో ఉంటే భూముల్ని లాక్కుంటాడా? జనం అంత అమాయకులా? సర్వే చేసి భూముల సరిహద్దులు చూపించినారు కదా! మరెందుకు ఇలా పెచారం సేత్తన్నారు? రెండు నెలల నుంచి ఏటీ పుర్రాకులు.. వోలింటీర్లు సక్కగా ఇంటికాడికొచ్చి పించినీలు ఇచ్చేవారు. ఇప్పుడేమో బ్యాంకుల సుట్టూ తిరగాల్సి వత్తాంది. జగన్‌బాబు వచ్చిన కాడి నుంచి అన్ని పనులు జరుగుతున్నాయి..' అంటూ సీఎం జగన్ 59 నెలల పాలనపై జనం చర్చించుకుంటున్నారు. మునగపాక మండల కేంద్రంలో రచ్చబండ వద్ద వృద్ధులు, స్థానికులు జగన్ పాలనపై వారి అభిప్రాయాలు చెప్పుకున్నారు. పాసు పుస్తకాలపై కొన్ని పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని, మన భూముల్ని సీఎం ఎందుకు లాక్కుంటారని పలువురు ప్రశ్నించారు. ఇంటి వద్దకే పింఛన్ వచ్చేదని, వలంటీర్లు పింఛన్లు అందించే వారని మరికొందరు ప్రశంసించారు. ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు ఎలాంటి వివక్ష లేకుండా అందించారని పేర్కొన్నారు. ఇప్పుడు పింఛన్ల కోసం సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చిందని వాపోయారు. ఇది కేవలం రాజకీయం కోసమే చేశారని నిట్టూర్చారు. జగన్ పాలన పట్ల సంతృప్తిగా ఉన్నామని రచ్చబండలో వృద్ధులు, స్థానికులు చెప్పిన అభిప్రాయాలు..

జగన్‌బాబుకు రుణపడి ఉంటాం..



ముసలాళ్లమందరం జగన్‌బాబుకు రుణపడి ఉంటాం. ఇచ్చిన మాట పెకారం పించినీ మూడేల వరకూ పెంచినారు. ఎక్కడా లంచం నేదు.. మధ్యవర్తు లు నేరు. మాలాంటి కుటమానాలకు పించినీ సొమ్ము చాలా అవసరం. **– వి.సన్యాసిరావు**

రెండు నెలలుగా ఇబ్బంది పడతన్నాం..



రెణ్నెల్లుగా సరిగా పించినీ అందక ఇబ్బంది పడతన్నాం. అంతకు ముందు బాగానే ఇంటికాడికొచ్చి ఇచ్చేవోరు. మాలాంటి ముసిలాళ్లకు తెల్లవారుజామునే పించినీ ఇచ్చినప్పుడు ఎంతో సంతోషమేసేది. మాలాంటి వాళ్ల విషయంలో రాజకీయాలు సేయడం తగదు. **– బి. పైడిరాజు**

పుర్రాకులు పడకుండా ఇచ్చేవారు



ఎటువంటి పుర్రాకులు పడకుండా పించినీ ఇచ్చేవోరు. రెండు నెలల నుంచి ఎందుకు ఇబ్బంది పెడతన్నారో తోచడం నేదు. పించినీ సొమ్మును పెంచారు కూడా. జగన్ పాలనలో మా ముసిలాళ్లకు ఎటువంటి ఇబ్బం నేకుండా పోయింది. ఎన్నికలు, రాజకీయాలు వేరు. పెజల సమస్యలు వేరు. **– పి.వరదేశినాయుడు**

వోలంటీర్ల సేవలు బాగున్నాయి..



వోలంటీర్ల సేవలు బాగున్నాయి. పించినీ, అన్ని రకాల సట్టిపికెట్లు మాకు వచ్చేలా సేవలందించినారు. ఇప్పుడేమో వారి సేతులు కట్టేసినారు. పెజలకు మంచి సేసే వోళ్లని అడ్డుకోకూడదు. మాలాంటోళ్లను ఇబ్బంది పెట్టకూడదు.**– పి.రాము**

భూములపై పెచారం దారుణం




జగన్‌బాబు పాలనలో భూములు లాగేసుకుంతారని పెచారం చేయడం దారుణం. సర్వే చేసి పాసు పుస్తకాలు ఇచ్చినారు. సీఎం ఫొటోవు పెట్టుకుంటే మా భూములపై హక్కులు పోతాయా? మాం ఊరుకుంతామా? ఇటువంటి తప్పుడు పెచారాలు సేయకూడదు. **– ఎ.సోమునాయుడు**

అన్ని పనులు సక్కగా జరుగుతున్నాయి..



జగన్‌బాబు వచ్చినప్పటి నుంచి సక్కగా పనులు జరుగుతున్నాయి. వోలింటీర్లు ఇంటికాడికొచ్చి పించినీలు ఇచ్చేవారు. ఇళ్ల స్థలాలు రూల్ పెకారం ఇచ్చినారు. పథకాలు కూడా ఎక్కడికీ తిరక్కుండా ఇంటి వద్దే అందుకున్నాం. **– బి.శ్రీరాములు**

ఇంటికొచ్చి పించినీ ఇచ్చీవోరు..



వోలింటీర్లు ఇంటికొచ్చి పించినీ ఇచ్చీవోరు. మా కుటుమానికి ఆ పించినీ సొమ్మే ఆధారం. రెండు నెలలుగా పించినీ డబ్బుల కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వత్తాంది. జగన్‌బాబు పాలన బంగారం కాదూ.. **– ఎ.సూరి అప్పారావు**

జగన్ మాటిత్తే మడమ తిప్పడు..



జగన్‌బాబు మాటిత్తే మడమ తిప్పడు. ఇచ్చిన హామీలన్నీ సేసి సూపించాడు కదా. మాలాంటి ముసలాళ్లకు ఎంతో మేలు సేసినాడు. ఇంటి కాడికే సంచేమ పథకాలు అందజేసినాడు. లంచాలు, దళారుల బెడద బెగులు లేకుండా బ్యాంకుల్లోనే సొమ్ములేసినాడు. **– పి.నాగబాబు**

గొర్రెల్లాగ పరిగెత్తిస్తున్నారు...



పించినీ కోసం గొర్రెలనాగా పరుగులుపెట్టిత్తన్నారు. జగన్‌బాబు పాలనలో అందరికీ మేలు జరిగింది. ఇంటికాడికొచ్చి పించినీ ఇచ్చే రోజులు వచ్చినప్పుడు సంతోషమేసింది. మళ్లీ ఇప్పుడు పించినీ కోసం పరుగులు పెట్టిత్తన్నారు. **– డి.శివ**